ప్రజాశక్తి
శనివారం 13 సెప్టెంబర్ 2025 5 అనంతపురం





అలుపెరుగని యోధుడు 'ఏచూరి'

అనంతపురంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ముఖ్యంగా అనంతపురంలోని టవర్‌క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కొనసాగుతున్న మతోన్మాదం నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే ఏచూరికి నిజమైన నివాళి అని పునరుద్ఘాటించారు...

హమ్మయ్య.. క్షేమంగా ఇంటికి చేరాం

నేపాల్ నుంచి స్వస్థలానికి చేరిన కుటుంబం
ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన దంపతులు



నేపాల్ నుంచి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి -అనంతపురం కలెక్టరేట్

'హమ్మయ్య క్షేమంగా ఇళ్లు చేరాం.' అని నేపాల్ అల్లర్లలో చిక్కుకుని ఇంటికి చేరిన బాధితులు తెలిపారు. అనంతపురం నుంచి తీర్థ యాత్రలకు నేపాల్ వెళ్లిన ఇద్దరు దంపతులు అక్కడ జరిగిన అల్లర్లలో చిక్కుకుని బిక్కుబిక్కు మంటు రెండు రోజులు కాలం వెళ్లదీశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అక్కడ చిక్కుకున్న తెలుగు వారందరినీ స్వస్థలాలనికి తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అనంతపురం నగరం నుంచి కూడా మల్లికార్జున ,శశికళ దంపతులు ఈనెల నాలుగో తేదీన నేపాల్‌కు తీర్థ యాత్రలకు అని బయలుదేరి వెళ్లారు. వారు ఈనెల ఆరవ తేదీన కాట్మాండ్‌కు చేరుకున్నారు. అప్పటికే అక్కడ చిన్నపాటి అల్లర్లు మొదలైనట్టు స్థానికులు తెలిపారని మల్లికార్జున అక్కడి విషయాలను తెలిపారు, అయితే రాత్రికి అవి తీవ్ర రూపం దాల్చి తాము ప్రయాణిస్తున్న బస్సు అద్దాలను ధ్వంసం చేసారని చెప్పారు. అయితే ఎలాగోలా రాత్రికి తాము బస చేసిన లాడ్జీకి చేరుకున్నట్టు వివరించారు. అయితే రాత్రి మరింతగా అల్లర్లు ఊపందుకున్నాయన్నారు. తమ లాడ్జీ పక్కనున్న ప్రభుత్వ కార్యాలయాన్ని కూడా మంటపెట్టి అంటించేసారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో తాము ఎలా బయటపడగలమని ఆందోళన చెందామని మల్లికార్జున తెలిపాడు. అయితే తమతోపాటు నేపాల్ కు వచ్చిన ఒక మహిళ రాష్ట్రంలోని ఇక్కడి అధికారులకు సమచారామివ్వడం, వారి ద్వారా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడటం జరిగిందన్నారు. ఆయన తమను ఆందోళన చెందవద్దు ఇంటి వరకు చేర్చే బాధ్యత తీసుకుంటామనిచెప్పి ధైర్యం చెప్పారన్నారు. చెప్పినట్టుగానే ఆయన చొరవతో మరుసటి రోజు విమానంలో తమను తిరుపతికి చేర్చారన్నారు. అక్కడి నుంచి కూడా వాహనాల్లో తమ ఇంటి వరకు చేర్చారని తెలిపారు. తమను ఇంటికి చేర్చే విధంగా కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు ఆ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. వారు ఇంటికొచ్చిన విషయం తెలియగానే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌లు వెళ్లి పరామర్శించి వచ్చారు. వారికి సీట్లు అందజేసి క్షేమంగా ఇంటికి చేరడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మంటగలిసిన మానవత్వం

ముళ్లపొదల్లో ఆడశిశువు-ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స



ముళ్లపొదల్లో ఉన్న ఆడశిశువు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

ఏ తల్లికి భారమైందో తెలియదు.. ఓ ఆడశిశువును ఎందుకు వద్దనుకున్నారో అర్థం కాలేదు.. జన్మించిన గంటల వ్యవధిలోనేన ఆడశిశువును ముళ్లపొదల్లో పడేసిన ఘటన శుక్రవారం కళ్యాణదుర్గం పట్టణ సమీపంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈసంఘటనతో మానవత్వం మంటగలిసిందని చెప్పడంలో సందేహంలేదు. పట్టణ సమీపంలోని ధర్మవరం రోడ్డు గ్యాస్ గోదాము వద్ద అప్పుడే పుట్టిన శిశువును ముళ్లపొదల్లో పడేసిన విషయం గమణించిన స్థానికులు సిఐ యువరాజ్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన కానిస్టేబుళ్లను పంపి పరిశీలించగా అక్కడ ఆడశిశువు ఉన్నట్లు గుర్తించారు. తర్వాత సిడిపిఒ లక్ష్మీప్రసన్నకు చెప్పడంతో కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించగా జడివానలో శిశువు తడవడంతో నిమోనియో సోకినట్లు తెలిపారు. దీంతో వారం రోజుల పాటు ఆర్డీటీ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించాలి

హెచ్ఎల్‌సి కార్యాలయం ఎదుట ధర్నాలో రైతు సంఘం నాయకులు



ధర్నాలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా నీటి పారుదల సలహా మండలి (ఐఎబి) సమావేశాన్ని వెంటనే నిర్వహించి రైతుల పంటల సాగుకు నీరందేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో హెచ్ఎల్‌సి కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ హంద్రీనీవా నీరు పది టీఎంసీలు తాగునీటికి కేటాయించాలన్నారు. ఆయకట్టుకు 130 రోజులు సాగు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. ఖరీఫ్‌లో వర్షాలు సకాలంలో రాకపోవడంతో 87 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయకుండా బీడుగా పెట్టారని తెలిపారు. ఈ ఏడాది తుంగభద్ర జలాశయం నుంచి 24.068 టీఎంసీలు కేటాయించినట్లు అధికారులు ప్రకటించారన్నారు. సకాలంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారని రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కానీ ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా ఐఎబి సమావేశం జరపకుండా ఉండడంతో ఆయకట్టు నీరు ఎప్పుడు ఇస్తారో అని రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులు వెంటనే జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి నీరు సకాలంలో ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నీటి పారుదల శాఖ ఎస్ఈ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్.రాయుడు, రాజారామ్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, వలీ, భాస్కర్ రెడ్డి, పోతలయ్య, రైతులు వెంకట, కొండ రెడ్డి పల్లి శ్రీనివాసులు, సాయికుమార్, లక్ష్మణ్ కుమార్, జయమ్మ, ఈరప్ప, వెంకటేష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీలకు వేతనాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయం వద్ద ఆందోళనలో నాయకులు, హమాలీలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సివిల్ సప్లయ్ హమాలీలను నాల్గవ తరగతి ఉద్యోగులు గుర్తించి బకాయి వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల (సిఐటియు అనుబంధం) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ హమాలీలు సివిల్‌సప్లయ్ డిఎం కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం గేటుకు తాళం వేసి లోపలికి ఎవరిని వెళ్లనీయకుండా అడ్డుకుని నిరసన తెలిపారు. సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ హమాలీలకు బకాయి వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. తక్షణమే బకాయి వేతనాలు ఇవ్వాలన్నారు. శ్రమించే కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. హమాలీలు అధిక బరువులు మోసి 55 ఏళ్లకే అనారోగ్యాలకు గురవుతు అభద్రత నడుమ జీవిస్తున్నారని తెలిపారు. వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని స్టాక్ పాయింట్లలో పని చేస్తున్న హమాలీలకు జూలై నెల వేతనం ఆగస్టు 15వ తేదీ లోపల జమ చేశారని, అనంతపురం జిల్లాలోని స్టాక్ పాయింట్‌ల హమాలీల పట్ల అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేతనాలు పడలేదని అన్నారు. 2023 దసరాకు ఇవ్వాల్సిన యూనిఫామ్, కుట్టు కూలి ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఇది పూర్తిగా అధికారుల వైఫల్యమే అన్నారు. వెంటనే బకాయి పడిన 2 నెలల వేతనాలు, 2021 దసరాకి ఇవ్వాల్సిన యూనిఫామ్, కుట్టిన కూలి, ఈ దసరాకు ఇవ్వాల్సిన స్వీటు, బోనస్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. స్పందించిన డిఎం హమాలీలకు బకాయి వేతనాలు సోమవారం లోపల చెల్లిస్తామని, 2023కు సంబంధించిన యూనిఫామ్, యూనిఫామ్ కుట్టిన కూలి వచ్చే వారం లోపల ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు, హమాలీలు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా హమాలీ యూనియన్ అధ్యక్షులు హరి, కోశాధికారి ఈశ్వర్, కమిటీ సభ్యులు శివ, శంకర్, అక్కులప్ప, సూరి, చిన్న హనుమంతు, గోవిందు, నాగరాజు, గోవిందు, సి.నారాయణస్వామి, 12 స్టాక్ పాయింట్‌ల హమాలీలు పాల్గొన్నారు.

తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి



పోలీసులు అభ్యంతరం తెలపడంతో పుట్లూరు సమీపంలో ఓతోటలో కూర్చొన్న పెద్దారెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం తాడిపత్రి పట్టణానికి వచ్చారు. పెద్దారెడ్డి పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో 12 సెంట్లలో నిర్మాణం చేపట్టగా రెండు సెంట్లు మున్సిపల్ స్థలం అందులో ఉందని జేసి.ప్రభాకర్‌రెడ్డి చాలాకాలంగా ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు శుక్రవారం కొలతలు వేశారు. డిప్యూటీ జనరల్ ఆఫ్ సర్వేయర్‌తోపాటు, మున్సిపల్, రెవెన్యూ అధికారులందరూ కలసి సర్వే చేపట్టారు. ఈ విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన స్వగ్రామమైన తిమ్మంపల్లి నుంచి వాహనాల్లో తాడిపత్రికి బయలుదేరి వచ్చారు. దీంతో తాడిపత్రి పట్టణంలో కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్

పోలీసుల బందోబస్తు

జేసీ.ప్రభాకర్‌రెడ్డికి పెద్దారెడ్డికి మధ్య వైరం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అక్కడికి చేరుకున్న పెద్దారెడ్డి సర్వే చేస్తున్న అధికారులతో వాగ్వాదానికి దిగారు. లేఅవుట్‌లో 16 ప్లాట్లు ఉన్నాయని అన్నింటినీ రెండు వైపుల నుంచి సర్వే చేసి నివేదిక తనకూ ఒకటివ్వాలని కోరారు. అదే విధంగా భవన నిర్మాణానికి సంబంధించి అనుమతుల్లేవని చెబుతున్న విషయంపైన కూడా నివేదికను అందివ్వాలని టౌన్‌ప్లానింగు అధికారులను కోరారు.

పుట్లూరులో హై డ్రామా

పుట్లూరు : తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన స్వగ్రామం తిమ్మంపల్లి నుండి తాడిపత్రికి పుట్లూరు మీదుగా బయలుదేరగా పుట్లూరు గ్రామం దాటిన తర్వాత పెట్రోల్ బంకు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. సాయంత్రం 3 గంటల వరకు తాడిపత్రి కి వెళ్లేందుకు అనుమతి లేదని ఎస్పీ నుంచి మెయిల్ రావడంతో పుట్లూరు సమీపంలోని తోట వద్దనే పెద్దారెడ్డి కూర్చున్నారు. దీంతో ఉదయం 9 నుంచి 11గంటల మధ్య వరకు మాజీ ఎమ్మెల్యే వర్సెస్ పోలీసుల మధ్య హై డ్రామా నడిచింది. సాయంత్రం మూడు గంటల వరకు తాడపత్రి కి వెళ్లేందుకు అనుమతి లేదన్న పోలీసులు 11 గంటలకే వెళ్ళమని చెప్పడంతో పుట్లూరు నుండి 11 గంటలకు పెద్దారెడ్డి బయలుదేరి వెళ్లారు.

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాల్సిందే..

కలెక్టరేట్‌ను ముట్టడించిన ప్రజలు- ఉద్రిక్తతల నడుమ డిఆర్‌ఒ మలోలకు వినతి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యూవల్ చేయించి సేవలు పటిష్టం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు కృషి చేయాలని దళిత, గిరిజన, వెనుకబడి వర్గాల ప్రజల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యూవల్ చేయడంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ శుక్రవారం జిల్లాలోని దళిత, గిరిజన, బిసి వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా రోడ్డుపై బైటాయించి రస్తారోకో నిర్వహించారు. గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఆర్‌డిటి ద్వారా లబ్ది పొందిన మహిళలు ప్రజలు పెద్ద ఎత్తున సేవ్ ఆర్‌డిటి నినాదాలతో హోరెత్తించారు. మా జీవితాల్లో వెలుగు నింపి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఆర్‌డిటిని కాపాడుకోవడాన్ని ఎంతటి త్యాగాలకైన వెనకాడమంటూ మహిళలు గర్జించారు. కలెక్టరేట్‌లోపలికి చొచ్చుకుని వెళ్లారు. పోలీసులు నియంత్రించిన లాభం లేకుండా పోయింది. వందలాధి మంది ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ లోపలకి వెళ్లారు. అప్పటికి పోలీసులు డిఆర్‌ఒ మలోలకు పరిస్థితి వవరించడంతో ఆందోళన కారుల వద్దకే వచ్చి వారి నుంచి వనతి స్వీకరించారు. మీ విజ్ఞాపనలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన ప్రజా సంఘాల నేతలు కుంటిమద్ది ఓబులేసు, కెపి.నారాయణస్వామి, మద్దెల చెరువు మల్లి, చిన్న ఆంజనేయులు, చిన్న పెద్దన్న, చామలూరు రాజగోపాల్, ఆదిశేషు, చిరంజీవి, శ్యామల, బాల పెద్దన్న, చిర్రొళ్ల రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. ఇద్దరికి గాయాలు

బెలుగుప్ప : బెళుగుప్ప నక్కలపల్లి గ్రామాల మధ్య రాయదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలాల్లో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్, ప్రయాణికురాలు గాయపడ్డారు. రాయదుర్గం డిపోకు చెందిన ఆర్డినరీ ఆర్టీసీ బస్సు నక్కలపల్లి మీదుగా బెలుగుప్పకు వస్తోంది. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పిన బస్సు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 17 మంది ఉన్నారు. పలువురికి స్వల్ప గాయాలు కాగా బస్సు కండక్టర్ రమేష్, ప్రయాణికురాలైన అంజనమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం బెళుగుప్ప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. ప్రమాదానికి కారణం బస్సు కండీషన్ సరిగా లేకపోవడమేనని తెలుస్తోంది. పాత బస్సు కావడంతో పాటు స్టీరింగ్ కూడా సరిగా లేనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా గురువారం రాత్రి కురిసిన వర్షం వల్ల నల్లరేగడి నేలలో తేమ ఎక్కువగా ఉన్నందున మలుపు వద్ద బస్సు కంట్రోల్‌కాక పొలంలోకి దూసుకెళ్లిందని డ్రైవర్ అంజి తెలిపారు.

ప్రమాదఘటనపై మంత్రులు ఆరా ...

అనంతపురం జిల్లా బెలుగుప్ప-నక్కలపల్లి మార్గంలో ఆర్టీసీ బస్సు బోల్తాపడిన ఘటనపై రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆరా తీశారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని చెప్పారు. ప్రమాదానికి సంబంధించిన కారణాలు తెలుసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా బసుప్రమాదంపై అధికారులతో ఆరా తీశారు.

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఆకస్మిక మృతి

పలువురి నివాళి



మృతిచెందిన భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మింగా మృతిచెందారు. తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో పనులు చేయిస్తూ అకస్మాత్తుగా కళ్లు తిరిగి కింద పడిపోయాడు. వెంటనే గమణించి అనంతపురంలోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా పని చేసిన తోపుదుర్తి కవితమ్మ భర్త తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి. ఈయన కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పని చేశారు. ఈయనకు మాజీ ఎంపీ, వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డితో మంచి అనుబంధం ఉంది. ఆయన మరణవార్తతో అనంత వెంకటరామిరెడ్డి తీవ్ర దిగ్బ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహం వద్దకు చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అలాగే సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన చిన్నాన్న భాస్కర్‌రెడ్డి మృతిపై బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇకపోతే తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యేలు జెసి ప్రభాకర్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కోనారెడ్డి, మహానందరెడ్డి, శివశంకర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గాయత్రి మిల్క్ డైరీ శ్రీనివాస్‌రెడ్డి, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, దాదాగాంధీ, దాడితోట వెంకటరెడ్డి, తదితరులు భాస్కర్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా భాస్కర్ రెడ్డి అంత్యక్రియలు శనివారం తోపుదుర్తిలో నిర్వహించనున్నారు.



బడికెళ్లాలంటే వంక దాటాల్సిందే..

ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణం
తల్లిదండ్రుల్లో భయాందోళనలు







నదిలో వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-శింగనమల

వర్షం కురిస్తే చాలు ఆ విద్యార్థులు ప్రాణాలు చేతిలో పెట్టుకుని పాఠశాలకు వెళ్లాలి. ఎందుకంటే చిన్నపాటి వర్షం కురిసినా వంక పొంగి పొర్లుతుంది. దీంతో భయంభయంగా నీటిలోనే వంక దాటుకుని పాఠశాలకు వెళ్లాలి.. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చిట్టూరు గ్రామానికి చెందిన దాదాపు వందమంది విద్యార్థులు తరిమెలకు వెళ్లి విద్యనభ్యసించాలి. తరిమెల-చిట్టూరుకు మధ్యలో పులుసువంక ఉంది. ఈ వంక చిన్నపాటి వర్షం కురిసినా పొంగి పొర్లుతుంది. దీంతో ప్రాణాల చేతుల్లో పెట్టుకుని వంక దాటాల్సిన పరిస్థితులు. ఈనేపథ్యంలోనే గతరాత్రి కురిసిన భారీ వర్షానికి నది పారుతోంది. చేసేది లేక విద్యార్థులు అందరూ ఒకరిచేయి మరొకరు పట్టుకుని భయం భయంగా నదిని దాటి పాఠశాలకు వెళ్తున్నారు. ఈ ప్రయాణంలో ఏ ఒక్కరు చేయి వదిలినా అందరూ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పులుసు వంకపై బ్రిడ్జి ఏర్పాటు చేసి విద్యార్థులతో పాటు ప్రజల ప్రాణాలకు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడటమే 'ఏచూరి'కి నిజమైన నివాళి

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప


రాప్తాడులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశంలో కొనసాగుతున్న మతోన్మాదం నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి మనం అర్పించే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద సభలో ఓ.నల్లప్ప మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యంతో పాటు, విదేశాంగ విధానం, లౌకికవాదం, ఫెడరలిజంకు మతోన్మాదం నుంచి వస్తున్న ప్రమాదాన్ని ఎదుర్కోవడమే నిజమైన నివాళి అన్నారు. బిజెపి ఫాసిస్ట్, మతోన్మాద ధోరణి నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సి ఉందన్నారు. దేశంలో సోషలిజం ఎన్ని ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న సీతారాం ఏచూరి మార్క్సిస్టు భావజాలాన్ని ముందుకు తీసుకుపోయారని కొనియాడారు. సీతారాం ఏచూరి మరణించారనే విషయాన్ని ఇప్పటికే నమ్మలేకపోతున్నామన్నారు. భారత రాజకీయాల్లో పెను మార్పులు వస్తున్న ప్రస్తుత సమయంలో అభ్యుదయ, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల పాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఏచూరి లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. డాక్టర్ వీరభద్రయ్య మాట్లాడుతూ సీతారాం ఆశయాలను కొనసాగించడం అందరికి కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.చంద్రశేఖర్, ఆర్‌వి.నాయుడు, నగర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటనారాయణ, ముర్తుజ, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, ఎర్రిస్వామి, రాజు, ఎన్టీఆర్ సీన, పండ్లతోటల రైతు సంఘం నాయకులు శివారెడ్డి, బిహెచ్.రాయుడు, సంజీవరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు ఆజాం, ఆది, రామాంజనేయులు, నాగరాజు, జ్యోతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తి ప్రదాత అని.. ఆయన అడుగుజాడల్లో భవిష్యత్తు కర్తవ్యాలను నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, రాప్తాడు రూరల్ ప్రాంతీయ కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం లేని లోటు దేశ రాజకీయ రంగంలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారత రాజ్యాంగ మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజంపై ఆర్‌ఎస్ఎస్, దాని పనుపున నడుస్తున్న బిజెపి కేంద్ర సర్కారు తీవ్రమైన దాడి చేస్తున్న తరుణంలో, దాన్ని ఎదిరించి పోరాడే శక్తులను ఐక్యపర్చి ముందుకు తీసుకుపోవడంలో సీతారాం కృషి అసమానమైందన్నారు. అలాంటి ఆయన లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శులు మల్లేష్, మధు, సభ్యులు లక్ష్మన్న, ప్రతాప్, సుబ్బారావు, నారాయణస్వామి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు : కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తి ప్రదాత అని.. ఆయన అడుగుజాడల్లో భవిష్యత్తు కర్తవ్యాలను నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు అన్నారు. సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో కెవిపిఎస్ నాయకుడు జగ్గిలి రమేష్ అధ్యక్షతన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి లేని లోటు పార్టీకే కాకుండా దేశానికి తీరని లోటు అన్నారు. ప్రజాస్వామ్యంతో పాటు విదేశాంగ విధానం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజం కూడా ప్రమాదం ఎదుర్కొంటున్నాయన్నారు. బిజెపి ఫాసిస్ట్, మతోన్మాద ధోరణి నుండి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయ పౌరుడిపై ఉందన్నారు. ఏచూరి మార్క్సిజం భావజాలాన్ని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి.శ్రీనివాసులు, సంచార జాతుల రాష్ట్ర సంఘం కార్యదర్శి వై.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్రబాబు, రంగమ్మ, పట్టణ కమిటీ నాయకులు తిమ్మప్ప, షబ్బీర్, సూరి, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామంలో ఉన్న బస్టాండ్ సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సూరి, నాయకులు టి.పెద్దయ్య, టి.ఆదినారాయణ, జయ, పెద్దయ్య, వీటి కుళ్లాయప్ప, నాగమణి, సుధాకర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో కామ్రేడ్ సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శులు రంగారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకులు శ్రీనివాసులు, కౌలు రైతుసంఘం ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.


భవానీ రవికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

'స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్'గా భవానీ రవికుమార్

అనంతపురం : స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన జనసేన నాయకులు భవానీ రవికుమార్ శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి పొంగూరు నారాయణ, 'స్వచ్ఛాంధ్ర రాష్ట్ర ఛైర్మన్ పట్టాభిరామ్ సమక్షంలో రవికుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. సమిష్టి కృషితో ప్రజా సమస్యలను పరిష్కరిచేందుకు బాధ్యతగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

నర్సుల విధి విధానాలపై నిర్లక్ష్యం తగదు

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ

ప్రజాశక్తి-అనంతపురం


సమావేశంలో మాట్లాడుతున్న నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ

రాష్ట్ర ప్రభుత్వం నర్సుల విధి విధానాలపై నిర్లక్ష్యం విడాలని నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాధమ్మ, కోటమ్మ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ధన్వంతరి హాల్లో నర్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నర్సుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. నిబంధనల ప్రకారం ప్రమోషన్లను జరపడం లేదని, ఉద్యోగ కల్పనలో నిర్లక్ష్యం కారణంగా పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒపివిని దృష్టిలో ఉంచుకుని నర్సుల నియామకాలను చేపట్టడం లేదన్నారు. ఫలితంగా వెట్టి చాకిరీ చేయాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం పక్కనపెట్టి నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో సర్వజన ఆస్పత్రిలో నర్సులతో వెట్టి చాకిరి చెయిస్తున్నారన్నారు. నిబంధనలకు అనుగుణంగా సిబ్బందిని నియమించకపోవడంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి నిబంధనలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లతా, ట్రెజరర్ సంధ్యా అరుణ, నాగమణి, అసోసియేషన్ సభ్యులు, నర్సులు పాల్గొన్నారు.

పది రోజుల కష్టం 'సూపర్ హిట్' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ విజయవంతం వెను నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త, నాయకుడి పది రోజుల కష్టం ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సభ విజయవంతమైన నేపథ్యంలో శుక్రవారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం రాష్ట్ర జిల్లా నగర కమిటీ నాయకులు, క్లస్టర్, కోక్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలో సభ నిర్వహించాలని నిర్ణయించిన రోజు నుంచి విజయవంతమయ్యే రోజు వరకూ నాయకులు, కార్యకర్తలు రేయింబవళ్లు తీవ్రంగా శ్రమించారన్నారు. సభ విజయవంతం చేసి మరోసారి నన్ను గెలిపించారన్నారు. సభ సక్సెస్ కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున ఫోన్లు చేసి అభినందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, మాజీ మేయర్ స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

రూ.14కోట్ల పనులు..రూ.47వేలు రికవరీ

ప్రజావేదికలో అధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 19వ విడత సామాజిక తనిఖీలపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, డ్వామా డివిజ శ్రీనివాసులు, ఎపిడి రాజారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గం మండలంలోని 19 పంచాయతీల్లో 250 రకాల పనులకు రూ.14.40కోట్ల పనులు జరిగాయన్నారు. ఉపాధి పనులకు సంబంధించి రూ.11.15కోట్లు, పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.3.7కోట్లు, అటవీశాఖకు సంబంధించి రూ.1.83 కోట్ల పనులు జరిగినట్లు వెల్లడించారు. ఆయా పనుల్లో కొలతల్లో తేడాలు, ఇతర కారణాలను గుర్తించిన అధికారులు రూ.47,684 రికవరీకి ఆదేశించారు. రూ.92,800 అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో డ్వామా జిల్లా అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఎంపిడిఒ కొండన్న, ఎపిఒ రవి, ఆర్డబ్ల్యుఎస్ జెఇ మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్కూల్ గేమ్స్ సెపక్‌తక్రా జట్లు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

ఉరవకొండ : త్వరలో ఉరవకొండలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సెపక్‌తక్రా అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికల జిల్లా జట్లును శుక్రవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ప్రాంగణంలో ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మారుతీప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఎస్‌కె ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు కె.నాగరాజు, నాగేంద్ర, పి.రాఘవేంద్ర, బి.కృష్ణ, శివకుమార్, రాయుడు, అనిత, నాగేంద్ర, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 1130 మెట్రిక్ టన్నుల యూరియా రాక

అనంతపురం : జిల్లాకు 1130 మెట్రిక్ టన్నుల ఇఫ్కోయూరియా శుక్రవారం ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు శుక్రవారం వచ్చినట్లు ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఇందులో మార్క్‌ఫెడ్‌కు 580 మెట్రిక్ టన్నులు, 220 మెట్రిక్ టన్నులు, సొసైటీలకు 330 మెట్రిక్ టన్నులు ప్రయివేటు డీలర్లకు సంయుక్త కలెక్టర్ ఆదేశం ప్రకారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు, రేపు రాష్ట్ర మహాసభలు

మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న దయా రమాదేవి

జిల్లాకేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్రం ప్రభుత్వం ప్రధాన మంత్రి పోషణ నిర్మాణ యోజనగా మార్పు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్పు చేసిందన్నారు. అనేక సంవత్సరాలుగా స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. బడి ఈడు పిల్లలను బడి బాట పట్టించేందుకు పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు 1995లో మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పోషకాహారం మెరుగౌతున్నప్పటికీ గ్రామీణ, బడుగు వర్గాల పిల్లల్లో పోషకాహార లోపాలు ఇంకా ఉన్నాయని తెలిపారు. 2022-23లో రాష్ట్రంలో 20 శాతం పిల్లలకు కనిష్ట బరువు, ఎదుగుల లోపంతో ఉన్నారని నివేదికలు చెబుతున్నాయని తెలిపారు. కావున పథకాన్ని మరింత పటిష్టం అమలు చేసేందుకు బడ్జెట్ పెంపుదల చేయాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.10వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలన్నారు. మౌలిక వసతులు కల్పించాలన్నారు. పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించరాదన్నారు. డిమాండ్‌లు నెరవేర్చాలని రాబోవు రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభలకు మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి పాల్గొన్నారు.

గూగూడు అభివృద్ధికి కృషి

ఎంపి అంబికా, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గూగూడు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం ఎంపి దత్తత గ్రామం మండల పరిధిలోని గూగూడులో రూ.15లక్షలు ఎంపి నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపి, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ.7లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముందుగా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన ఎంపికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనం పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అలాగే రూ.5లక్షల ఎంపీ నిధులతో త్వరలోనే బస్‌షెల్టర్ నిర్మానానికి భూమిపూజ చేస్తామన్నారు. రాష్ట్రంలోనే ఆధ్యాత్మిక కేంద్రమైన గూగూడును అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తావన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, మాజీ ఎంపిటిసి, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ ఆకుల ఆంజనేయులు, ప్రతాపచౌదరి, కన్వీనర్ ఎర్నాగప్ప, ధారపనేని చంద్రబాబు, సుల్తాన్‌పేట మహేష్‌నాయుడు, ఆకుల తేజ, శివానాయుడు, ప్రకాష్‌నాయుడు, పసుపులేటి లక్ష్మీనారాయణ, బింగి తిరుపతయ్య, రామానాయుడు, జాఫర్‌వలి, మాజీ ఎంపీటీసీలు రాజన్న, రాఘవనాయుడు, ఓబులేసు, నరసింహులు, హరీష్, రాజేష్, అంకన్న, ఆదినారాయణ, తిప్పన్న జనసేన నాయకులు గంజిగుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్, శ్రీధర్‌బాబు, కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఎపిఎం తిప్పమ్మ, కార్యదర్శి కీర్తన, సచివాలయ సిబ్బంది పాల్గొనారు.

తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తాం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం


భూమిపూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం పట్టణాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయడంతోపాటు తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని విప్ కాలవ శ్రీనివాసులు చెప్పారు. పట్టణంలో రూ.30 లక్షలతో చేపట్టిన తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులకు శుక్రవారం పట్టణ పొలిమేరలోని బళ్లారి రోడ్డు వద్ద భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో పట్టణవాసులు తనకు 16వేల ఓట్ల భారీ మెజారిటీ ఇచ్చారని గుర్తు చేశారు. తనపై నమ్మకం, విశ్వాసంతో ఇచ్చిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గత టిడిపి పాలనలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు, అర్ధాంతరంగా ఆగిన రైల్వే వంతెన పనులు పూర్తి చేయటంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. కనేకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుండి పట్టణానికి నీటి సరఫరా చేస్తున్న పైప్‌లైన్ మరమ్మతులకు మరో రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాయదుర్గంలో నీటిశుద్ధి కేంద్రం నుంచి వాటర్ ట్యాంక్ వరకూ కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తుండడంతో మూడు కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందన్నారు. దీంతో పట్టణంలోనీ 30, 31, 32 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, వైస్‌ఛైర్మన్ వలిబాషా, మున్సిపల్ వార్డు సభ్యులు, ప్రశాంతి, పద్మజ, జ్యోతి, శారద, గోవిందరాజులు, మాజీ సభ్యులు హనుమంతు, ధనార్జున, తిప్పేస్వామి, భారతి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటేశులు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మహబూబ్‌బాషా,కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ సురేష్, టిడిపి నాయకులు కృష్ణమూర్తి, వేణు, శివప్రసాద్, వెంకటేశులు, రాజశేఖర, యల్లప్ప, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి 'హ్యాకథాన్'లో జెఎన్‌టియు విద్యార్థుల సత్తా



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అతిథులు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వాలి హ్యాకథాన్ సెమీఫైనల్ పోటీల్లో అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉన్నత విద్యా మండలి అడ్వైజర్‌గా రాజేంద్ర వ్యవరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ అనేది కొత్తగా మొదలైన ఒక పరిశోధనాంశం అన్నారు. దీన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతపురం జెఎన్‌టియు క్వాంటం టెక్నాలజీకి సంబంధించి కోర్సులను సిలబస్‌లో భాగాంగా చేర్చడంతో పాటు, మైనర్ డిగ్రీని కుడా అందిస్తున్నారన్నారు. విద్యార్థులంతా క్వాంటం టెక్నాలజీపై అవగాహన పెంచుకుని భవిష్యత్ లో అవకాశాలను అందిపుచ్చుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పిలుపుమిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డిఫడిక్ సి.శోభాబిందు, కోఆర్డినేటర్లు కె.మాధవి, ఆర్.రాజశేఖర్, ఎపి శివకుమార్, సీనియ ఆచార్యులు ఎ.ఆనందరావు, బి.ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సమావేశానికి వజ్రకరూరు సర్పంచికి ఆహ్వానం



ఉరవకొండ : ఈనెల 15వతేదీన దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొనాలని వజ్రకరూరు సర్పంచు మోనాలిసాకు ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే సర్పంచుల సమావేశానికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. స్వచ్ఛ సుజల్, నారీ బల్ మిత్ర, సుశాసిత్ సమృద్ధి, సురక్ష, స్వస్తి సంపన్న పంచాయతీల ప్రాతిపాదికన సర్పంచులను ఎంపిక చేశారన్నారు. దేశవ్యాప్తంగా 75 మంది సర్పంచులను ఎంపిక చేస్తే వారిలో తనకూ కూడా అవకాశం కల్పించడం అనుభూతిగా ఉందన్నారు.

'రణభేరి'ని జయప్రదం చేయండి : యుటిఎఫ్



పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

బ్రహ్మసముద్రం : ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎపి యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, సాయిరామ్ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఈనెల 15 నుంచి 19వతేదీ వరకూ రణభేరి యాత్ర నిర్వహించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. యాత్ర ఈనెల 16న గుంతకల్లు నుంచి ప్రారంభమై వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్ రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం కేంద్రంలో ముగుస్తుందన్నారు. కావున ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యుటిఎఫ్ నాయకులు అశోక్‌కుమార్, కదరప్ప, దాదావలి, శ్రీరాములు, రఘునాథ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు ఔన్నత్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి


ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో విసి బి.అనిత

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఔన్నత్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుపై ఉందని వైస్ ఛాన్స్‌లర్ బి.అనిత సూచించారు. జాతీయ, అంతర్జాతీయ శిబిరాల్లో విజేతలైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను శుక్రవారం స్థానిక విసి ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఎస్‌కెయు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రాణించడం ప్రశంసనీయమన్నారు. కర్ణాటకలోని మంగళూరులో రెండు రోజులపాటు జరిగిన ఐకాన్ అంతర్జాతీయ శిబిరంలో పాల్గొని మూడు ఈవెంట్లలో విజేతగా నిలిచిన హిందూపూర్‌లోని ఎన్ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సర బీకాం విద్యార్థిని బి.మదీహా, రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం రాష్ట్ర సమాచార కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మురళీధర్‌రావు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పిఆర్ఒ కె.రామగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మానసిక ఆరోగ్య సమస్యలు-ఆత్మహత్యల నివారణ'పై ప్రిన్సిపాల్ పి.హర్షలత అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జి.బాలాజీ మాట్లాడుతూ మానసిక రుగ్మతలు అనేవి ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తనను ప్రభావితం చేసే పరిస్థితులు, నిరాశ, నిస్పృహ, ఆందోళన, స్కీజోఫ్రేనియా వంటి 200 కంటే ఎక్కువ రకాల మానసిక రుగ్మతలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ పిఆర్ఒ జీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీధర్, డాక్టర్ కె.రవిశంకర్, రెడ్ రిబన్ క్లబ్ కోఆర్డినేటర్ మౌనిక సాయి, ఐసిఐసి కోఆర్డినేటర్ ప్రభావతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఎంటి జోష్న, చెంచు బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై అవగాహన

పుట్లూరు : మండల పరిధిలోని శనగలగూడూరు, తక్కలపల్లి రైతు సేవాకేంద్రంలో శుక్రవారం యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు హేమావతి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులో యూరియాను వాడినట్లయితే పెట్టుబడి తగ్గింపుతోపాటు నేల కలుషితం కాకుండా కాపాడుకోవచ్చన్నారు. దీనికితోడు సంప్రదాయ యూరియా బదులు నానో యూరియాను వాడినట్లయితే ఖర్చు తక్కువతోపాటు ఎక్కువ రోజులు మొక్కలకు బలం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయని, వ్యవసాయ విస్తీర్ణ అధికారి చిన్ననాగిరెడ్డి, గ్రామ వ్యవసాయ అధికారులు రాజ్యలక్ష్మి, సావిత్రి, రైతులు పాల్గొన్నారు.

డ్రైయినేజీల పరిశీలన

శింగనమల : మండల పరిధిలోని శోదనపల్లి ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపిపి పాఠశాల, కాలనీలో ఉన్న డ్రైయినేజీలను ఇఒఆర్‌డి విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వచ్చినప్పుడు పాఠశాల సమీపంలో డ్రైయినేజీ నిండి నీరు నిల్వ ఉంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే సమస్య లేకుండా చేయాలని సూచించారు. అలాగే ప్రజలు తమ ఇళ్ల ముందు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ దోమతెరలు వాడి దోమకాటుకు గురికాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బొమ్మన గోపాల్‌రెడ్డి, పెద్దమట్లగొంది కార్యదర్శి రమణారెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బ్రహ్మసముద్రం విద్యార్థిని

బ్రహ్మసముద్రం : ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న శకుంతల ఎంపికైనట్లు పిఇటి ఇబ్రహీం, ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జరిగిన సెపక్‌తక్రా పోటీల్లో అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయికి జి.శకుంతల ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు బాలరాజు, లింగమ్మ, ఉపాధ్యాయులు హనుమంతురెడ్డి, రవికుమార్, మధుసూదన్, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ప్రారంభం

గుత్తి : గుత్తి కోటపైన ఉన్న హజ్రత్ సయ్యద్ షా సయ్యద్ బాషావలి ఖాద్రీ రహమతుల్లా అలైహి 678వ ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం గంధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు మాట్లాడుతూ 13న ఉరుసు, 14 జియారత్ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ఉరుసు సందర్భంగా ఖవ్వాలి, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

24న దళిత రణభేరి

రాయదుర్గం : దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ ఈనెల 24వ తేదీన విజయవాడలో దళిత రణభేరి పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బహుజన సమాజ్ పార్టీ రాయలసీమ ఇన్‌ఛార్జి చిందనూరు నాగరాజు తెలిపారు. శుక్రవారం రాయదుర్గంలోని బీఎస్పీ కార్యాలయంలో దళిత రణభేరికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు, అధ్యక్షులు జైచంద్ర, ప్రకృతి, కార్యదర్శులు తిప్పేస్వామి, రాజు, లింగప్ప, గంగాధర, మల్లి, శివరుద్ర, గంగప్ప, హనుమంతు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు సాయం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి తెలిపిన వివరాల మేరకు.. ఓ ప్రమాదంలో తండ్రి మృతిచెందడంతో గణేనాయక్ కాలనీకి చెందిన ముగ్గురు చిన్నారులు నానమ్మతో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించి ట్రస్టు సభ్యులు డాక్టర్ జి.హరినాథ్‌రెడ్డి చిన్నారుల కోసం రూ.5వేలు, డాక్టర్ బండి రమేష్‌బాబు, కుమార్తె శివాని మరో రూ.5వేలు ఇవ్వడంతో బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అసోసియేట్ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి కాలనీలో వసతులు కల్పించాలి

గుంతకల్లు : స్థానిక రామిరెడ్డి కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు శుక్రవారం కాలనీలో పర్యటించి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామిరెడ్డి కాలనీలో సిసి రోడ్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు జిలాన్, సత్తార్, ఆశాబీ, మాబున్నీ, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు రాందాస్, నారాయణ, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

శింగనమల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిహెచ్‌సి కౌన్సిలర్ వెంకటపతి, ప్రిన్సిపాల్ కవిత హెచ్ఐవి, ఎయిడ్స్‌తోపాటు సుఖవ్యాధులు, డ్రగ్స్‌పై క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు జెడికె సుప్రియ, జి.చంద్రశేఖర్, కె.ఎలిజిబెత్, కె.గౌసియాభాను, శ్యామల, కె.సతీష్‌కుమార్, హాజీపీర్, చాంద్‌బాషా, లింక్‌వర్కర్ పి.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

శింగనమల : మండల పరిధిలోని కల్లుమడి గ్రామానికి చెందిన జి.ఆదిలక్ష్మి కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శుక్రవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు, నాయకులు కె.ఓబిరెడ్డి, డీలర్ కంబగిరి, డైరెక్టర్ మల్లికార్జున, టిడిపి కార్యకర్త జి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'పొలికేక'ను జయప్రదం చేద్దాం

ఉరవకొండ : ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న జిల్లాకేంద్రంలో చేపట్టనున్న భారీ పొలికేక ర్యాలీని విజయవంతం చేద్దామని ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మీనుగ గోపాల్, సర్పంచు జగదీష్, అక్కులప్ప, నెరమెట్ల యల్లన్న మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీకలగురికి మారెన్న, లత్తవరం చంద్రశేఖర్, మోపిడి వన్నూరుస్వామి, ప్రసాద్, తిప్పేస్వామి, చెన్నప్ప, అంజి, రాజశేఖర్, వన్నూరుస్వామి, ఉరవకొండ రమేష్‌బాబు, పెద్దన్న, కొత్తకోట మారెన్న, రామాంజనేయులు, రాకెట్ల ఆనంద్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు ఆకుల బాబుకు పరామర్శ

నార్పల : తీవ్ర జ్వరంతో గత కొద్దిరోజులుగా బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మండల టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు)ను ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆకుల బాబుతో కలిసి టిడిపి కార్యాలయంలోకి వెళ్లి కార్యకర్తలతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా ఎంతో ఇబ్బందిగా ఉన్న నార్పల-గూగూడుకు వెళ్లే మార్గంలో హెచ్చెల్సీ కెనాల్‌పై ఉన్న బ్రిడ్జి వెడల్పు చేయాలని ఆకుల బాబు ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎంపి అప్పటికప్పుడే హెచ్ఎల్‌సి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

యల్లనూరు : మండల పరిధిలోని చిలమకూరు ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాజమణి బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బాల్య వివాహాలను ప్రోత్సహించరాదన్నారు. బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్ మహేష్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇన్నోవేషన్ ఫ్రంటీర్స్' బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

'ఇన్నోవేషన్ ఫ్రంటీర్స్ 2025'కు సంబంధించిన బ్రోచర్‌ను ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో అక్టోబర్ 15న జాతీయస్థాయి వన్‌డే కాన్ఫరెన్స్ 'ఇన్నోవేషన్ ఫ్రంటీర్స్ 2025' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సదస్సులో పాల్గొని సాంకేతిక విజ్ఞానం, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్, కెమిస్ట్రీ రంగాల్లో జరుగుతున్న తాజా పరిణామాలను వివరించనున్నట్లు తెలిపారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఒ శ్రీనాథ్, బయోటెక్నాలజీ విభాగాధిపతి రిజ్వానాబేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే 'మిషన్ శక్తి' లక్ష్యం

సిడిపిఒ సాజిదాబేగం

ప్రజాశక్తి-తాడిపత్రి



మాట్లాడుతున్న సిడిపిఒ సాజిదా బేగం, ప్రిన్సిపల్ లావణ్య

మహిళల రక్షణ, సంక్షేమం, సాధికారత కల్పించడమే మిషన్ శక్తి లక్ష్యమని సిడిపిఒ సాజిదాబేగం అన్నారు. శుక్రవారం తాడిపత్రి మున్సిపాలిటీలోని నందలపాడులోని మోడల్ స్కూల్‌లో మహిళా సాధికారత ప్రత్యేక పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ తాడిపత్రి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పది రోజులపాటు లింగ నిష్పత్తి, లింగ వివక్ష, సెక్సువల్ రీ ప్రొడక్టివ్ హెల్త్, పోష్ యాక్ట్, పోక్సో చట్టం, స్కిల్ ప్రోగ్రాం, హెల్త్ అండ్ న్యూట్రిషన్ వంటి కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య, సూపర్‌వైజర్లు పి.ఉమాదేవి, కె.రామలక్ష్మి, బి.లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు శంకరమ్మ, ముంతాజ్, సురేఖ, లలిత, లక్ష్మీకాంతమ్మ, హైమావతి, పర్వీన్, తేజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్ఇడి ధృవీకరణపై అవగాహన

ప్రజాశక్తి-యాడికి

చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్ (జెడ్ఇడి) ధృవీకరణ పథకంపై శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ సమావేశ భవనంలో విశాలాక్షి సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు గణేష్, రాజేష్, షేక్షావలి మాట్లాడుతూ జెడ్ఇడి ధృవీకరణం మూడు స్థాయిల్లో ఉంటుందన్నారు. బ్రాంజ్, సిల్వర్, గోల్డ్ సంస్థల పని తీరును బట్టి ఆయా ప్రమాణాలు ఇస్తారన్నారు. తద్వారా ఎంఎస్ఎంఇలు దేశీయంగా, అంతర్జాతీయంగా వ్యాపార అవకాశాలు పొందవచ్చన్నారు. ధృవీకరణ పొందిన వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందేందుకు సులభతరం అవుతుందన్నారు. జెడ్ఇడి ధృవీకరణ పత్రం కోసం సెల్..99664 84146, 99596 21615 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాలాక్షి సేవా సంస్థ అధ్యక్షుడు గూండా నారాయణస్వామి, విజన్ స్కూల్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్, కాకతీయ ప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో ఉన్న చౌడేశ్వరి ఆలయం వద్ద జెడ్ఇఒ ధ్రువీకరణ పత్రాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అధికారులు గణేష్, రాజేష్, షేక్షావలి పరిశ్రమల ఏర్పాటుపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో చింతా పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం : ఎంపిపి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



మాట్లాడుతున్న అధికారులు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో వైద్యసిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. ఎంపిపి అధ్యక్షతన గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ ఫాగింగ్ చేయాలన్నారు. ఇకపోతే త్వరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామ్‌గోపాల్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సదాశివం, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, హౌసింగ్ డిఇ రామ్మూర్తి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-యల్లనూరు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు ప్రాథమిక వైద్యుడు లోకేష్‌కుమార్ తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూజియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి : మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో నిల్వ ఉన్న నీటిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో గంబూజియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ గంబూజియ చేపలను నీటిలో వదలడం వల్ల లార్వాను తిని రోగాలు రాకుండా అడ్డుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్ స్వర్ణలత, అసిస్టెంట్లు శరత్, మద్దిలేటి, ఆశా కార్యకర్త పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.